క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న ఏపీఎం కల్పలత

పాలసముద్రం: బాల్య వివాహాలు, మహిళలపై వివక్ష చూపడం, గృహ హింస చట్టరీత్యా నేరమని ఐకేపీ ఏపీఎం కల్పలత తెలిపారు. శుక్రవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు బాల్య వివాహం, గృహ హింసపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐకేపీ ఏపీఎం కల్పలత మాట్లాడుతూ స్త్రీలు, పురుషులు సమానమని, లింగ వివక్ష చూపకూడదని, బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. రక్త హీనత గురించి వివరించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, శోభ, మంజుల, మహిళలు పాల్గొన్నారు.

సాయిల్ హెల్త్‌కార్డులతో రైతులకు లాభాలు



హెల్త్ కార్డులు అందిస్తున్న ఏఓ లక్ష్మీప్రసన్న

కార్వేటినగరం: సాయిల్ హెల్త్‌కార్డులతో రైతులకు అనేక లాభాలు కలుగుతాయని జిల్లా వనరుల కేంద్రం ఏఓ లక్ష్మీప్రసన్న అన్నారు. శుక్రవారం మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల నుంచి 260 మట్టి నమూనాలను జియో కోఆర్డినేట్ ద్వారా సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏఓ మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరువుల వాడకం తెలుసుకుకోవచ్చునని పేర్కొన్నారు. అనంతరం ఆలత్తూరు, బట్టువారిపల్లి, కొల్లాగుంట గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరించారు. అలాగే సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హేమలత, వీఏఏ కల్పన, రైతులు పాల్గొన్నారు.

పండుగలా మెగా తల్లిదండ్రుల సమావేశం



ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో శ్రీదేవి

నగరి : మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని పండుగలా నిర్వహించుకుందామని ఎంఈవో శ్రీదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో శుక్రవారం మండలంలోని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ డిసెంబర్ 7వ తేదీ జరగనున్న మెగా తల్లిదండ్రుల సమావేశానికి దాతలు, పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులను స్వాగతించాలని సూచించారు. మెగా సమావేశం విధివిధానాలపై అవగాహన కలించారు.

కాపు సంఘం అధ్యక్షుడికి ఘన సన్మానం



విజయబాబును సన్మానిస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురం: చిత్తూరు కాపు సంఘం అధ్యక్షుడిగా నియమితులైన 49 కొత్తపల్లి విజయబాబుని మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సరిత జనార్దన్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గం కాపు సంఘ అధ్యక్షుడిగా కాపుల అభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. అలాగే మండలంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని అన్నారు. అనంతరం కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబాబుని సన్మానించారు. ఈ కార్యక్రమానికి నాయకులు మణి, సుబ్బునాయుడు, బాబు, ఆనంద్, జయ, మహేష్, ఉమాపతి, నెలవాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

సంతపేట సబ్‌స్టేషన్ తనిఖీ



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంతపేట సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. సాధారణ పరిశీలనలో భాగంగా సెక్షన్ ఆఫీసులో తనిఖీ చేశారు. సెక్షన్ పరిధిలో మొత్తం సర్వీసులు, ఫీడర్ల సంఖ్యపై ఆరా తీశారు. లైన్‌లాస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెలవారీ విద్యుత్ బిల్లులు వందశాతం వసూలు చేయాలన్నారు. సబ్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకుని, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను లైన్‌ఇన్‌స్పెక్టర్లు చూడాలన్నారు. లైన్ ఎన్నిసార్లు ట్రిపింగ్ అవుతుందన్న విషయం ఓ పుస్తకంలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈ ప్రసాద్, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉసిరి.. ఆరోగ్య సిరి!

శ్రీహరిపురంలో ఉసిరి తోట, (ఇన్‌సెట్) చెట్టుకు కాసిన కాయలు





ఉసిరిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ ఎక్కువగా ఉంటుంది. వంద గ్రాముల ఉసిరిలో 300 మిల్లీగ్రాముల విటమిన్–సి ఉంటుంది. మహిళల్లో అయితే నెలసరి సమస్యలు తగ్గించడం, ప్రత్యుత్పత్తి వ్యవస్థ సక్రమంగా పనిచేయడంలో ఉసిరి సాయపడుతుంది. అలాంటి ఉసిరి సాగు చేసిన రైతులకు మంచి దిగుబడితోపాటు ఆదాయాన్ని ఇస్తుంది. ప్రస్తుతం మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి తీసుకొస్తే రైతులు లాభాల బాటలో పయనించే అవకాశం ఉంది.

- ఒక్కసారి సాగుచేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడి
- ఎకరాకు 7 టన్నుల దిగుబడి
- 200 ఎకరాల్లో సాగవుతున్న పంట

విజయపురం : సంప్రదాయ పంటల సాగుకు అలవాటు పడిన రైతులు, ఆ పంటలతో ఆశించిన ఫలితం లేక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గంలో ఉద్యాన తోటలు క్రమంగా విస్తరిస్తూ వచ్చాయి. మామిడి, జామ, బొప్పాయితోపాటు డ్రాగన్ ఫ్రూట్, ఉసిరి తోటలు, మునగ, కాకర, తదితర కూరగాయలు, పూల మొక్కలు సాగుచేస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇందులోనూ ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఉసిరి సాగుపై ఇప్పుడిప్పుడే రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎలాంటి నష్టాల్లేని ఉసిరి మొక్కను ఒక్కసారి నాటితే 40 ఏళ్ల వరకూ దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు.

ఏడాదికి రెండు పంటలు

వ్యవసాయంలో సంప్రదాయ పంటలు పండించిన వారికి ఆశించిన లాభాలు లేకపోవడంతో కొంత మంది రైతులు ఉసిరి పంట సాగుచేస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు ఫలసాయాన్ని అందిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను కురిపిస్తూ రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. 15 ఏళ్ల క్రితం తమిళనాడుకు చెందిన వ్యక్తి ముందు ఎకరా విస్తీర్ణంలో వంద ఉసిరి మొక్కలు నాటాడు. ప్రస్తుతం ఇవి ఏపుగా పెరిగాయి. మొక్క నాటిన ఐదేళ్ల తర్వాత దిగుబడి ప్రారంభమై మంచి ఆదాయం వచ్చింది. దీంతో విజయపురం మిట్టూరు, శ్రీహరిపురం, కాకవేడు ప్రాంతాల్లోని రైతులు ఉసిరి పంటను సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఉసిరి సాగవుతోంది.

200 ఎకరాలలో ఉసిరి

తమిళనాడు తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకునే రైతులు ఈ ప్రాంతాల్లో సాగుచేస్తున్నారు. ఒక్కసారి సాగు చేసి మొక్కలు నాటితే రెండేళ్లకు కాపు వచ్చి ఏడాదికి రెండు సార్లు ఫల సాయం అందుతోంది. ఎకరాకు 200 చెట్లు నాటి సాగుచేసిన రైతులు చెట్టు పెరుగుదలను అనుసరించి ఎకరాకు 5 నుంచి 7 టన్నుల వరకు దిగుబడిని పొందుతున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే 30 నుంచి 40 యేళ్ల వరకు ఫలసాయం అందుతుందని ఉద్యానవన అధికారులు తెలుపుతున్నారు. ఉసిరి చెట్టు నీటి ఎద్దడి చాలా వరకు తట్టుకుంటుంది. చీడపీడలు, తెగులు ఎక్కువగా ఆశించదు. ఈ కారణంగా సాగు ఖర్చు తగ్గుతుంది. రాబడిలో ఖర్చు 10 శాతం మాత్రమే ఉంటుంది. డిమాండ్‌ను బట్టి టన్నుకు రూ.50 వేలు నుంచి రూ.70 వేలు వరకు ధర పలుకుతుంది.

ఆయుర్వేద ఉసిరి

ఆయుర్వేద వైద్యానికి ఉసిరే కీలకం. అందుకే ప్రతీ వ్యక్తీ తన జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలయినా నాటాలని పూర్వీకులు చెబుతారు. మనకు రోగ నిరోధకశక్తి పెరగాలంటే సి – విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లూ కూరగాయలూ తినాలి. కరోనా పుణ్యమా అని ఈ విషయం మాటలు సరిగ్గా రాని పసివాళ్ల నుంచి వృద్ధుల వరకూ అందరికీ నోటిమాటగా మారిపోయింది. అయితే ఆ విటమిన్ ఎక్కువగా ఉండే వాటిలో ప్రథమ స్థానం ఉసిరికే దక్కుతుంది. ఆరోగ్యాన్ని అందించే ఉసిరి రైతులకు లాభాలను కూడా మెండుగా అందిస్తోంది.

మంచి డిమాండ్ ఉన్న పంట

ఉసిరి మంచి డిమాండ్ ఉంది. ఇందులో మందులు, సిరప్‌లు, ఆయిల్, సోపు, ఊరగాయలు తయారీకి ఎక్కువగా వినియోగిస్తారు. దీంతో ఉసిరికి ఎప్పుడు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. మన రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, తెనాలితోపాటు తమిళనాడు చెన్నై, తెలంగాణలోని హైదరాబాద్‌లో గల ఫ్యాక్టరీలకు తరలిస్తుంటారు. పంట సాగు చేసిన వెంటనే ఫ్యాక్టరీ వారు ముందుగా అడ్వాన్స్‌లు ఇచ్చి కొనుగోలు చేస్తారు.

నష్టం లేని పంట

పదిహేనేళ్ల క్రితం నుంచి ఉసిరి సాగుచేస్తున్నాను. తమిళనాడు తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకునే సాగు చేశారు. ఇప్పటి వరకు ఆ చెట్లే ఫలసాయాన్ని అందిస్తున్నారు. ఏడాదికి రెండు సార్లు కాపు వస్తోంది. తెగుళ్లు, చీడపీడల సమస్య ఎక్కువగా ఉండదు. పంట మధ్య కలుపు పెరగకుండా చూసుకుంటూ, చెట్లను పరిశీలించి కొంతమేరకు తెగులు ఎక్కడైనా కనిపిస్తే మందులు స్ప్రే చేసుకుంటే చాలు. మంచి దిగుబడి వస్తుంది. డిమాండ్‌ను అనుసరించి ఎకరాకు రూ.లక్ష వరకు లాభం ఉంటుంది. – జానకిరామ్, శ్రీహరిపురం, విజయపురం

పారదర్శకంగా చెరువు చైర్మన్ ఎన్నికలు



ఎన్నికలపై వివరిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ

పాలసముద్రం: మండల పరిధిలోని చెరువుల చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ క్రిష్ణమహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించే అధికారులకు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 8వ తేదీ జరుగునున్న ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. అర్హులు చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులేనన్నారు. చెరువుకి సంబంధించిన రైతులు మాత్రమే ఎన్నికల్లో హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ చీరాలయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గణపయ్యకు పూజలు కరువు

గంగాధరనెల్లూరు: మండలంలోని వింజం పంచాయతీలోని సిద్ధేశ్వరకొండ గ్రామంలోని శ్రీసిద్ధేశ్వర శివాలయానికి అనుబంధంగా ఉన్న వినాయకుని ఆలయంలో పూజలు చేయడం లేదు. పురాతన వినాయకుని ఆలయాన్ని కొన్ని సంవత్సరాల క్రితం కొందరు దాతల సహాయంతో పునర్నిర్మించారు. ప్రస్తుతం పూజలు చేయడానికి, ధూపదీప నైవేద్యాల సమర్పణకు పూజారి లేదని స్థానిక ప్రజలు తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు కల్పించుకుని ఒక పూజారిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శిక్షణ తరగతులు రద్దు చేయాలి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్టీయూ నాయకులు

నగరి : ఉపాధ్యాయులను ఒత్తిడికి గురి చేస్తున్న శిక్షణ తరగతులను రద్దు చేయాలని ఎస్టీయూ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని విజయపురం, నిండ్ర మండలాల్లో శుక్రవారం ఆయన ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్, నాయకత్వ శిక్షణ తరగతులను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తూ తీవ్ర మానసిక ఒత్తిడి మధ్య నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతుల్లో ఇదివరకే పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు, నిన్న శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ప్రాణాలు వదలడం బాధాకరమన్నారు. ఒకవైపు మానసిక ఒత్తిడికి గురై ఉపాధ్యాయులు ప్రాణాలు వదలుతున్నా శిక్షణ తరగతులను రద్దు చేయకపోవడం దారుణమన్నారు. పాఠశాలలలో రోజురోజుకూ వివిధ రకాల బోధనేతర పనులతో ఉపాధ్యాయులు సతమతమవుతూ కుంగిపోతున్నారని పేర్కొన్నారు. అరకొర వసతులు కలిగిన మారుమూల శిక్షణ కేంద్రాల్లో వైద్య సౌకర్యాలు అందుబాటులో లేకుండా నిర్బంధించి ఉపాధ్యాయులకు శిక్షణలు ఇవ్వడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి హేమ చంద్రారెడ్డి మాట్లాడుతూ సరెండర్ లీవులు బకాయిలు, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్ల ఫైనల్ పేమెంట్లు వెంటనే మంజూరు చేయాలని, 12వ పీఆర్సీకి సంబంధించి వెంటనే కమిషనర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు సుబ్రహ్మణ్యం, నాగభూషణం, జిల్లా కౌన్సిలర్లు పురుషోత్తం, అరుణ్ కుమార్, బాబు, నగరి డివిజన్ కన్వీనర్ గిరి బాబు, విజయపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళి, శ్రీనివాసులు, నిండ్ర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గిరి, హరి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



కార్వేటినగరం సీఐ హనుమంతప్ప

పాలసముద్రం: పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు. ఆయన శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులకు కొన్ని సూచనలు చేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులపై కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈవ్ టీజింగ్‌పై చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు పిల్లల కదలికపై దృష్టి సారించాలన్నారు. శారీరక శ్రమ అందించే క్రీడల్లో ప్రోత్సహించాలన్నారు. గంజాయి తదితర మాదకద్రవ్యాల మీద పూర్తి నిఘా పెంచామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పుత్తూరులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు





స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు, రైస్ షాపుల్లో తనిఖీలు చేస్తున్న అధికారులు

పుత్తూరు: పట్టణంలో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు కొలతల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటరవి మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని రాంబాబు బిర్యానీ హోటల్, వెంకటేశ్వర హాట్ చిప్స్, రాగ ఫాస్ట్‌ఫుడ్స్, కృష్ణా, భాస్కర్ టీ షాప్స్‌లో దాడులు చేశారు. అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. షాపు యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రైస్ హోల్‌సేల్ షాపుల్లోనూ బస్తాల తూకాలను పరిశీలించారు. తనిఖీల్లో తూనికలు కొలతల అధికారి మల్లేశ్వర్ మాట్లాడుతూ, నందిని ట్రేడర్స్, చిత్ర అండ్‌కో రైస్ షాపుల్లో తనిఖీలు చేయగా 26 కేజీలుగా ముద్రించిన బస్తాల్లో 25 కేజీలు మాత్రమే ఉండడంతో షాపు యజమానులు ఒక్కొక్కరికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. విలేజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హెడ్‌కానిస్టేబుల్ జయరామిరెడ్డి, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు వినియోగించుకోవాలి



మరుగుదొడ్ల వాడకంపై విద్యార్థుల మానవ హారం

కార్వేటినగరం: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకూడదని ఆర్‌డబ్ల్యూఎస్ ఐఈసీ జిల్లా కన్సల్టెంట్ శాంతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్‌కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఉమాశంకర్, మండల కో–ఆర్డినేటర్ ఏకాంబరం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పని వలసలు

పాలసముద్రం: మండలంలో కూలి పనులకు ఇతర ప్రాంతాలకు వలసలు తప్పడం లేదు. 100 రోజులు పనులు కల్పించాలని ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పథకం నీరుగారి పోతోంది. మండలంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఫీల్డ్‌అసిస్టెంట్లపై వేటు వేసింది. వారి స్థానంలో టీడీపీ నాయకులను ఫీల్డ్‌అసిస్టెంట్లుగా నియమించారు. అయితే వారు విధి నిర్వహణలో విఫలమవుతున్నారు. మండలంలో వనదుర్గాపురం, క్రిష్ణజమ్మపురం, శ్రీకావేరిరాజుపురం, వెంగళరాజుకుప్పం, పాలసముద్రం పంచాయతీల్లో ఉపాధిహామీ పనులు ఇవ్వడం లేదు. డ్వాక్రా గ్రూప్‌లో తీసుకున్న నగదు కట్టాలని మహిళలను బలవంతం చేస్తుండడంతో తమిళనాడుకి పనుల కోసం వెళ్తున్నారు. పనులు కావాలని ఫీల్డ్ అసిస్టెంట్లను అడిగితే వారు ఇంకా రాజకీయ నాయకుడనే ఉద్దేశంతోనే కూలీలకు సమాధానం చెబుతున్నారు. కొత్తగా బాధ్యత చేపట్టిన ఫీల్డ్ అసిస్టెంట్లకు పనులు చెప్పాలంటే ఉపాధి హామీ అధికారులు ఇబ్బంది పడుతున్నారు. వారితో గట్టిగా మాట్లాడితే టీడీపీ నాయకులకు చెబుతారని భయపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి కుటుంబానికి పని కల్పించాల్సి ఉంది.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి



రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీఓ

పాలసముద్రం: మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వచ్చిన రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సమస్యలు పరిష్కరించాలని ఆర్డీఓ భవాని శంకరి తెలిపారు. శుక్రవారం పాలసముద్రం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. రెవెన్యూ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ వచ్చే నెల రెండో విడత గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. అనుమతి లేకుండా మట్టి తరలింపు, ప్రభుత్వం భూమిని చదును చేయడం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు అందిస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా సంబంధిత వీఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులు కులం, నివాసం, ఆధాయం సర్టిఫికెట్ల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగకుండా సకాలంలో అందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరుణకుమారి, రీ సర్వే డీటీ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ గణేష్, ఎమ్ఆర్ఐ దేవి, వీఆర్ఓలు శ్రీనివాసులు, రమణయ్య, రమేష్, తంగరాజ్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

డైయింగ్ యూనిట్లపై ఉక్కుపాదం

- తమిళ వ్యాపారులే కాలుష్య కారకులు
- కాలువల్లో పారే రసాయన నీరు ఎప్పుడు అరికడతారు?
- ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు
- తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం చైర్మన్





సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నీలమేఘం, సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నగరి : డైయింగ్ యూనిట్ల నుంచి వెలువడే రసాయన వ్యర్థాల కారణంగా కాలుష్య కోరలు చాస్తుంటే దాన్ని అరికట్టడానికి అధికారులు ఎందుకు చొరవ చూపడం లేదని కౌన్సిలర్లు మున్సిపల్ సమావేశంలో ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలోని శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో వారు ఈ మేరకు గొంతెత్తారు. సమావేశం ప్రారంభంలో కమిషనర్ ఆదేశానుసారం అజెండాను మున్సిపల్ అధికారులు కౌన్సిల్‌కు చదివి వినిపించారు. అంజెండాలో పేర్కొన్న అంశాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. డైయింగ్ యూనిట్ల వారి నిర్వహణలో ఉన్న కామన్ ఈటీపీకి సంబంధిత విద్యుత్ బిల్లులు రూ.2 కోట్ల బకాయిలు ఉన్నట్లు ప్రస్తావనకు రాగా దీనిపై కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మాన్యువల్ డైయింగ్ యూనిట్లు ఎవరైతే నిర్వహిస్తున్నారో వారే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. పలువురు ప్లాంటుకు ఇంకా అనుసంధానం కాలేదని చెప్పారు. ప్లాంటు నిర్వహణలో ఉన్న కాలువల్లో ఎందుకు రసాయన నీరు పారుతోందన్నారు. ప్రతి ప్లాంటును పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని కోరారు. తమిళనాడు వ్యాపారులు ఇక్కడి డైయింగ్ యూనిట్లు బాడుగకు తీసుకొని నడుపుతున్నారని చెప్పారు. వారు ఇక్కడి నీటిని కలుషితం చేసి వెళ్లిపోతే ఇక్కడివారు దాన్ని భరించాలా అని ప్రశ్నించారు. వారు ప్లాంటు వాడుకొని వెళ్లిపోతే ఆ బిల్లులు మున్సిపాలిటీ చెల్లించాలా అన్నారు. ప్లాంటుకు బకాయి ఉన్న విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే అనుసంధానమైన డైయింగ్ యూనిట్ల వారి విద్యుత్ కనెక్షన్‌ను కూడా తొలగించాలని చెప్పారు. అప్పుడే పరిస్థితిలో మార్పు వస్తుందన్నారు. ఈ విషయంలో రాజకీయాలు పక్కన పెట్టి ప్రజాసంక్షేమం దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ వ్యవహరించాలన్నారు. దీనిపై చైర్మన్ పీజీ నీలమేఘం, కమిషనర్ కృష్ణారెడ్డి సమాధానమిస్తూ తప్పక డైయింగ్ యూనిట్లవారితో సమావేశం నిర్వహించి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రతి వార్డులోనూ ఫాగింగ్ చేయించాలని సూచించారు. కౌన్సిల్‌ను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీకి రావలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను అతి తక్కువ మొత్తంలో వసూలవుతోందని పన్ను వసూలుకు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం రెడ్డి, డీఈ రవీంద్రా రెడ్డి, టీపీవో వీఎల్ఎన్ మూర్తి, సీడీపీవో కృష్ణవేణి, మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదించిన అంశాలు

- నగరి మున్సిపల్ కార్యాలయంలో ఈ ఆఫీసు ఏర్పాటుకు రూ.3 లక్షలు సాధారణ నిధుల నుంచి మంజూరు
- సంతమైదానం, పళ్లిపట్టురోడ్డు, మున్సిపల్ బస్టాండు, పుదుపేట, ఏకాంబరకుప్పంలోని మున్సిపల్ దుకాణాలు గుత్తకు ఇచ్చేందుకు బహిరంగ వేలం
- ఎన్టీఆర్ నగర్‌లోని సీఎస్ఐ చర్చికి బకాయి ఉన్న రూ.43,753 పన్ను రద్దు చేయడం
- రూ.5 లక్షల వ్యయంతో విద్యుత్ దీపాల కొనుగోలు

క్రీడా నైపుణ్యం వెలికితీయాలి

గంగాధరనెల్లూరు: గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం వెలికితీయడానికి ఆటలు పోటీలను నిర్వహిస్తున్నామని విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్‌శెట్టి అన్నారు. మండలంలోని తూగుండ్రం హైస్కూల్లో జోనల్ క్రీడలలో భాగంగా శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం, నేతలు కలిసి టాస్ వేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. సీనియర్ బాలబాలికలు 10 వేర్వేరు టీంలు, జూనియర్ బాలురు 9 టీంలు, జూనియర్ బాలికలు నాలుగు టీంలుగా ఈ పోటీలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాజేంద్రనాయుడు, తూగుండ్రం పీహెచ్‌సీ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహులునాయుడు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న బాలికలు